క్లుప్తంగా

వైభవంగా రేణుక ఎల్లమ్మ తల్లి దేవర విగ్రహ ప్రతిష్ట



కొల్లిపర: మండలంలోని దావులూరిపాలెం గ్రామంలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవర నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం వేద పండితులు వైభవంగా నిర్వహించారు. నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పౌరసరఫర శాఖ మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ హాజరై అమ్మవారికి పసుపు కుంకుమ చీర సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్‌పాలెం గ్రామంలోనే గంగానమ్మ తల్లి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

ఆధార్ కేంద్రం మూసివేతతో ఇక్కట్లు



తెనాలిఅర్బన్: మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్డు వద్ద ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం గత ఏడాది చివరి నుంచి పనిచేయడం లేదు. తెనాలి, పరిసర గ్రామీణ ప్రాంత ప్రజలు ఆధార్‌లోని మార్పులు, చేర్పులు వంటి వాటి కోసం ఇక్కడకు వచ్చి వాటి సేవలు పొందేవారు. గడువు ముగియడంతో ఆధార్ కేంద్రం మూసివేసినట్లు తెలిసింది. ఆధార్ కేంద్రం మూసివేతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆధార్ కేంద్రం తెరిచే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే సహించం

చిరు వ్యాపారులకు రూరల్ ఎస్‌ఐ హెచ్చరిక



తెనాలిరూరల్: ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదని రూరల్ ఎస్‌ఐ కె.ఆనంద్ చిరు వ్యాపారులను హెచ్చరించారు. మండలంలోని నందివెలుగు గ్రామంలో తెనాలి - విజయవాడ రహదారిపై ఉన్న ప్రధాన కూడలి, కూడలి నుంచి అత్తోట వైపు, కొలకలూరు వైపున్న వంతెనల ఫుట్‌పాత్‌లు చిరు వ్యాపారాలకు నిలయాలుగా మారాయి. దీనివలన ఇక్కడ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఇది గమనించిన ఎస్‌ఐ ఆదివారం సాయంత్రం అక్కడి వ్యాపారులతో మాట్లాడారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండడంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నందున సోమవారం సాయంత్రంలోగా వ్యాపారాలను తీసి వేయాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని కోరారు.


వృద్ధాశ్రమంలో అన్నదానం



తెనాలిటౌన్: స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మాగాంధీ సేవాశాంతి ఆశ్రమంలో ఆదివారం మదర్స్ డే సందర్భంగా వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేశారు. వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం నిర్వాహకుడు ముద్దాబత్తుని రమణయ్య ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా బీజేపీ సీనియర్ నాయకుడు అడపా సంపత్‌రాయుడు పాల్గొని వృద్ధులకు అన్నదానం చేశారు. యోగ సభ్యులు రమణయ్య వారి తల్లి అమికమ్మ జ్ఞాపకార్థం మదర్స్ డే సందర్భంగా సేవా కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సావిత్రి, అనూష, జగదీశ్వరి, ఉమామహేశ్వరి, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, వై.కోటేశ్వరరావు, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

అధునాతన భవనం .. సరికొత్త రూపం

- మున్సిపల్ నూతన భవన నిర్మాణానికి సన్నాహాలు
- రూ.40 కోట్లతో పీపీపీ విధానంలో నిర్మాణం
- అప్పటి వరకు మార్కెట్ కాంప్లెక్స్‌లో మున్సిపల్ విభాగాలు



నూతనంగా నిర్మించనున్న భవనం డిజైన్

తెనాలి: ఆంధ్రా ప్యారిస్‌గా పిలుచుకునే పట్టణ మున్సిపాలిటీకి నూతన భవనం నిర్మాణానికి రంగం సిద్ధమైంది. దాదాపు ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన మున్సిపల్ భవనం శిథిలావస్థకు చేరటంతో ఆ స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. దాదాపు రూ.40 కోట్ల వ్యయంతో నిర్మాణం చేయనున్నారు. ఇందుకు సంబంధించిన డిజైన్‌ను ఎంపిక చేశారు. ప్రభుత్వ నిధులతో కాకుండా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ విధానం)తో ముందుకు వెళ్లనుండటం తాజా విశేషం!

పీపీపీ పద్ధతిలో....

సెలక్షన్ గ్రేడ్ హోదా కలిగిన తెనాలి మున్సిపాలిటీకి పీపీపీ పద్ధతిలో నూతన భవనాన్ని నిర్మించేందుకు సంబంధిత ఏజెన్సీలను ఆహ్వానించనున్నారు. ఇందుకు ముందుకొచ్చే ఏజెన్సీ ఆధారంగా టెండర్లు పిలుస్తారు. సెల్లారు కాకుండా నాలుగైదు అంతస్తులో ఈ భవనాన్ని నిర్మిస్తారు. అప్పటి వరకు సమీపంలోని మున్సిపల్ కూరగాయల మార్కెట్లోని ఖాళీ అంతస్తుల్లో మున్సిపల్ కార్యాలయాన్ని నిర్వహిస్తారు. జూన్ మొదటివారం నుంచి ఈ ప్రక్రియను ఆరంభిస్తారు. తరలింపు కాగానే పాత భవనాన్ని కూల్చివేస్తారు. కూల్చివేత, టెండర్లను పూర్తిచేసుకుని మూడునెలల్లో నిర్మాణ పనులను ఆరంభిస్తారు.

సుదీర్ఘ చరిత్ర!

సుదీర్ఘ చరిత్ర కలిగిన తెనాలి 1901 వరకు రేపల్లె తాలూకాలో ఉండేది. 1909లో రేపల్లెను ప్రత్యేక తాలూకాగా చేశారు. అదే ఏడాది అక్టోబరు ఒకటిన అయితానగర్, పినపాడు, చినరావూరు గ్రామాల్ని కలుపుతూ తెనాలికి మున్సిపాలిటీ హోదా కల్పించారు. తెనాలికి గల ప్రాధాన్యతను, జనాభాను పరిగణనలోకి తీసుకుని 1961 మార్చి 16న స్పెషల్‌గ్రేడ్ హోదా కల్పించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏకైక స్పెషల్‌గ్రేడ్ హోదాతో కొనసాగిన తెనాలి మున్సిపాలిటీకి 2023–24లో సెలక్షన్ గ్రేడ్ హోదా లభించింది.

1959లో ప్రస్తుత భవనానికి శ్రీకారం

మున్సిపాలిటీగా 1909లోనే ఆవిర్భవించినా శాశ్వత భవనానికి 1959లో అంకురార్పణ జరిగింది. మున్సిపల్ చైర్మన్‌గా చేసి, ఎమ్మెల్యేగా కొనసాగుతున్న ఆలపాటి వెంకట్రామయ్య పేరిట మున్సిపాలిటీ భవనానికి ఆ ఏడాది జనవరి ఒకటిన నాటి ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య శంకుస్థాపన చేశారు. ఆరేళ్ల తర్వాత నిర్మాణం పూర్తిచేసుకుని 1966 మే 16న నాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి చేతులమీదుగా ప్రారంభోత్సవం చేశారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో మెయిన్‌రోడ్డువైపు వ్యాపార దుకాణాలను, మొదటి, రెండు అంతస్తుల్లో



ప్రస్తుత మున్సిపల్ భవనం

మున్సిపాలిటీలోని వివిధ విభాగాలను ఏర్పాటుచేశారు. మున్సిపాలిటీ భవనంలో మొత్తం 62 వ్యాపార దుకాణాలున్నాయి. వీటినుంచి నెలకు రూ.ఆరు లక్షలకు పైగా అద్దెలు వస్తున్నాయి.

2006లో మున్సిపల్ భవనానికి అనుబంధంగా వెనుకవైపున గ్రౌండ్‌ఫ్లోర్‌లో మెప్మా, హెల్త్ సెక్షన్ భవనాన్ని, పై అంతస్తులో కౌన్సిల్ హాలును నిర్మించారు. ఈ భవనానికి తూర్పువైపున మెప్మా షెడ్‌ను ఏర్పాటు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్, కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ చాంబర్లు, రెవెన్యూ, అకౌంట్, ఆడిట్ సెక్షన్లు, టౌన్‌ప్లానింగ్, పబ్లిక్‌హెల్త్, మెప్మా, ఆరోగ్య విభాగాలు నడుస్తున్నాయి. శాశ్వత ఉద్యోగులు 229 మంది కాగా, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు 480 మంది వరకు పనిచేస్తున్నారు. వివిధ పనుల నిమిత్తం రోజూ వందలాది మంది కార్యాలయానికి వస్తుంటారు. 59 ఏళ్ల క్రితం నిర్మించిన ప్రధాన భవనం శిథిలావస్థకు చేరుకుంది. వివిధ విభాగాల్లో శ్లాబ్ పెచ్చులూడుతూ అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తోంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నూతన భవనానికి సంకల్పం

ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు అప్పటి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మున్సిపాలిటీ నూతన భవన నిర్మాణం చేయాలని ఆలోచన చేశారు. తెనాలి వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మున్సిపల్ భవన నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని ఆయన హామీనిచ్చారు. దీనితో రూ.15 కోట్ల వ్యయంతో మున్సిపాలిటీ భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంచేసి పంపారు. ఎన్నికల కోడ్ రావటంతో ఆ ప్రక్రియ అంతటితో ఆగిపోయింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ రాష్ట్ర ఆహార, పౌరసరఫరా లశాఖ మంత్రిగానూ వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. మంత్రి మనోహర్ సూచనలపై భవన డిజైన్‌లో మార్పులు చేశారు. సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్, అయిదు అంతస్తులతో నిర్మాణానికి నిర్ణయించారు. ఇందుకు రూ.40 కోట్ల అంచనాలను వేశారు. ఇందులో షాపింగ్ కాంప్లెక్స్ సహా ఉంటాయి. పీపీపీ పద్ధతిలో ముందుకొచ్చే ఏజెన్సీ 18–24 నెలల్లో భవనాన్ని నిర్మించి ఇవ్వాలి. 75 శాతం భవనం, అందులోని దుకాణాలు 20–25 ఏళ్లపాటు వారి అధీనంలో ఉంటాయి. ఆయా దుకాణాల నుంచి అద్దెలు వసూలు హక్కులు ఏజెన్సీ వారికే ఉంటాయని సమాచారం.

వైభవంగా ఐతానగర్ పేరంటాళ్లమ్మ తిరునాళ్ల

అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న మంత్రి నాదెండ్ల మనోహర్



తిరునాళ్లలో పాల్గొన్న మంత్రి నాదెండ్ల



ప్రతిష్టకు గౌరమ్మ, వెంకయ్యల విగ్రహాలను తెస్తున్న దృశ్యం

తెనాలిటౌన్: 200 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఐతానగర్ పేరంటాళ్లమ్మ తిరునాళ్ల మహోత్సవంలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతమని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. స్థానిక ఐతానగర్‌లోని గత నాలుగు రోజులుగా గౌరమ్మ- వెంకయ్య దేవాలయంలో పేరంటాళ్లమ్మ తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. చివరి రోజు ఆదివారం మధ్యాహ్నం పొంగళ్లు, మొక్కుబడులు, గండ దీపాలు, పసుపు బళ్లు, కరెంటు ప్రభలు, మేక సిడి వంటి సంప్రదాయ వేడుకలు నిర్వహించారు. దేవాలయంవద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఐతానగర్‌కు చెందిన వారే కాకుండా ఎక్కడెక్కడో స్థిరపడ్డ ఆ ప్రాంతవాసులు తిరునాళ్లలో పాల్గొన్నారు. కోర్కెలు నెరవేరిన వారు ఆనవాయితీగా మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి పాల్గొని అమ్మవారిని దర్శించి మొక్కులు




సిడిమాను ఏర్పాటు చేస్తున్న భక్త జనం

చెల్లించుకున్నారు. కొంగు బంగారమై కోర్కెలు తీర్చే గౌరమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మంత్రి మనోహర్ ఆకాంక్షించారు. దేవాలయ భక్త బృందం మంత్రి మనోహర్‌ను సాదరంగా ఆహ్వానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. నన్నపనేని ముకుందరావు, కన్నెగంటి మురళి, జెట్టి రేణుక, ఈదర పూర్ణచంద్, పలువురు భక్త బృంద సభ్యులు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం

తెనాలిటౌన్: దేశభక్తి, వ్యక్తిత్వ వికాసం యువతలో పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పనిచేస్తుందని పొత్తూరి ఆదిశేషయ్య, అంబటి మారుతీరామ్‌లు పేర్కొన్నారు. ఆదివారం తెనాలి పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నుంచి బయలుదేరి గాంధీ చౌక్, రామాలయం, గంగానమ్మగుడి, శివాలయం, పాతగవర్నమెంట్ హాస్పటల్, శివాజీచౌక్ మీదుగా వాసవీ అమ్మవారి దేవస్థానానికి స్వయం సేవకులు ర్యాలీ చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ వార్షిక ప్రథమ శిక్షా వర్గ కార్యక్రమంలో భాగంగా ఈ ర్యాలీ నిర్వహించారు. మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలో మే 1వ తేదీ నుంచి 17 వరకు యువతకు ట్రైనింగ్ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిక్షణలో దేశభక్తి, వ్యక్తిత్వ వికాసం పెంపొందించే అంశాలను నేర్పించినట్లు తెలియజేశారు. దేశం కోసం ప్రాణాలు అర్పించేదుకు వెనుకాడబోమని స్వయం సేవకులు ప్రతిజ్ఞ



పరేడ్‌లో పాల్గొన్న స్వయం సేవకులు

చేశారు. పట్టణంలో నిర్వహించిన స్వయం సేవకుల పద సంచలనం ఎంతగానో ఆకట్టుకుంది. నేర్చుకున్న శిక్షణను ప్రజలకు పరిచయం చేయడానికి ఈ పరేడ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈపూరి హరిపూర్ణ ప్రసాద్, జొన్నాదుల మనోహర్, శివశక్తి సుధాకర్, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, హిందూ చైతన్య వేదిక, రాష్ట్ర ఉపాధ్య పరిషత్ కార్యకర్తలు, 300 మంది స్వయం సేవకులు పాల్గొన్నారు.

చెత్త కాల్వ..!



పూలే కాలనీ వద్ద కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలు

పట్టణంలోని పూలే కాలనీకి వెళ్లే రహదారి వెంట ఉన్న ప్రధాన కాల్వల్లో వ్యర్థాల గుట్టలు దర్శనమిస్తున్నాయి. కాల్వ చెత్త, చెదారంతో నిండి దుర్గంధభరితంగా మారింది. నిత్యం అటువైపుగా వందల మంది రాకపోకలు సాగిస్తుంటారు. వీటివలన విపరీతమైన దుర్గంధంతో పాటు, దోమల వ్యాప్తి పెరిగిందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కాల్వలను బాగు చేయాలని కోరుతున్నారు.

\- తెనాలిఅర్బన్

గుండె జబ్బులపై అప్రమత్తత అవసరం

తెనాలిటౌన్: గుండె జబ్బులపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ పి.వెంకటేష్ సూచించారు. స్థానిక నందులపేటలోని కవిరాజాపార్కు వీజీకే భవనంలో ఆదివారం వాకర్స్ క్లబ్ ఏప్రిల్, మే నెల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ పి.వెంకటేష్ విచ్చేసి షుగర్ వ్యాధి వలన వచ్చే అనర్థాలను, వ్యాధులను వివరించారు. షుగర్ దీర్ఘకాలంగా ఉన్నవారికి ఇతర అవయవాలైన గుండె, కిడ్నీ, రక్తనాళాలు, మెదడు మొదలైన వాటి మీద ప్రభావం చూపుతుందన్నారు. రక్తనాళాల్లో రక్తప్రసరణ తగ్గి రక్తం గడ్డకట్టడం వలన గుండె జబ్బుకు దారి తీస్తుందని సూచించారు. అదేవిధంగా కిడ్నీమీద కూడా ప్రభావం చూపుతుందన్నారు. తరచుగా రక్త, మూత్ర పరీక్షలు చేయించుకుంటూ నడక, వ్యాయామం వంటివి చేయాలని సూచించారు. క్లబ్ ఉపాధ్యక్షుడు పాలడుగు ఆనందయ్య సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో క్లబ్ కార్యదర్శి కడియాల రవిబాబు, డాక్టర్ ఉదయ కిషోర్, రత్తయ్య, అశోక్, మొవ్వా సత్యనారాయణ, వీరసయ్య, రంగారావు, సాంబశివరావు, ఉదయశంకర్, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ వెంకటేష్‌ను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

చికిత్స పొందుతూ జూనియర్ అసిస్టెంట్ మృతి

తెనాలిరూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన జూనియర్ అసిస్టెంట్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ రజకచెరువు ప్రాంతానికి చెందిన ఉప్పలపాటి హరిప్రసాద్(38) పంచాయతీ రాజ్ శాఖ తెనాలి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. తలలో గడ్డ ఉండడం, బీపీ, షుగరు ఉండడంతో ఈ నెల 9వ తేదీ ఉదయం కూల్ డ్రింక్‌లో ఎలుకల మందు కలుపుకొని తాగాడు. రాత్రికి భార్యకు చెప్పడంతో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. శనివారం రాత్రి గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా నరసింహుని జయంతి

తాడేపల్లి రూరల్: పోలకంపాడులోని జైసింహాద్రి అప్పన్న దేవస్థానం వార్షికోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆదివారం నరసింహస్వామి జయంతిని ఘనంగా జరిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి పాల్గొన్నారు. కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారి ఊరేగింపు కనులపండువగా సాగింది.

జూన్ 7న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

తెనాలిఅర్బన్: కొల్లిపర మండలం తూములూరు గ్రామంలోని క్రిస్టియన్‌పాలెంలో నూతనంగా ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జూన్ 7వ తేదీన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం విగ్రహావిష్కరణకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాయంత్రం 5గంటల జరిగే కార్యక్రమంలో అంబేడ్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపకులు, సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. పెద్ద సంఖ్యలో దళిత నాయకులు, మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు గల్లా జ్ఞానశేఖర్, తెనాలి యోహాన్, కనపర్తి



వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అబ్రహాం లింకన్, యోహాన్, తదితరులు

మోహనరావు, కనపర్తి సుధాకర్, బేతాళ భూషణం, మధిర నాగేశ్వరరావు, కనపర్తి జేమ్స్, కనపర్తి అబ్రహాం లింకన్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

తెనాలిరూరల్: తెనాలి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ ఎస్.రమేష్‌బాబు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. ఘర్షణలు, వివాదాల్లో జోక్యం చేసుకోకూడదని చెప్పారు. ఆయన వెంట ఎస్‌ఐ ప్రకాశరావు ఉన్నారు.

మాతృమూర్తులకు సత్కారం



తెనాలిరూరల్: అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణ మారిస్‌పేటలోని రాక్ గాస్పెల్ చర్చిలో సీనియర్ సిటిజన్లైన మహిళా సభ్యులను సత్కరించి గౌరవించారు. సంఘ కాపరి బిషప్ డాక్టర్ పినపాటి జాన్‌పాల్ ఆధ్వర్యంలో అత్తోట రత్నకుమారి, కూచిపూడి సువర్ణకుమారి, రుద్రపాటి విక్టోరియా జ్యోతి, ఈపూరి భారతి, అత్తోట దేవకరుణ, చావలి సుభాషిణి, మిస్సమ్మ, ఆరమళ్ల చిన్నలను సత్కరించారు. సంఘ పెద్దలు పినపాటి డేవిడ్ రాజు, ఈపూరు శ్రీనివాసరావు, ఆరె దానియేలు, కసుకుర్తి భాస్కరరావు, జయరాజు, కరివెరపు ఏసుదాసు, పినపాటి ప్రాన్సిస్, ఈపూరి ఏసురత్నం పర్యవేక్షించారు. సంఘస్తులు పాల్గొన్నారు.

ఘనంగా మదర్స్ డే

తెనాలిఅర్బన్: ఇస్లాంపేటలోని యేసయ్య కొండ ప్రార్థన మందిరంలో మదర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రదర్ ఆనందన్న మాట్లాడుతూ కుటుంబంలో తల్లి పాత్ర ఎంతో ప్రాముఖ్యమైందన్నారు. మాతృమూర్తుల రుణాన్ని ప్రతి ఒక్కరూ తీర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దైవసేవకురాలు పి.రత్నకుమారి, చార్లెస్ వెస్లీ, ప్రశాంత్‌బాబు, వల్లి, నిర్మల, అలేఖ్య, అమూల్య, ఎబెన్, గ్రేసీ, ఆయాన్ష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నేలకొరిగిన భారీ చెట్టు



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి ప్రధాన రహదారిలో కార్పొరేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఆదివారం ఓ భారీ చెట్టు నేలకొరిగింది. చెట్టు రోడ్డుకు అడ్డంగా పడడంతో తాడేపల్లి ప్రధాన రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి. కమిషనర్ అలీమ్‌బాషాకు సమాచారం ఇవ్వడంతో స్పందించిన ఆయన కార్పొరేషన్ సిబ్బందిని పంపించి రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించారు. జేసీబీ సహాయంతో ఆ చెట్టును పూర్తిగా పక్కకు నెట్టించివేశారు. ఈదురు గాలులు లేకున్నా భారీ చెట్టు పడిపోవడంతో పలువురు ఆశ్చర్యానికి గురయ్యారు. నిత్యం ఆ రహదారిలో ద్విచక్రవాహనాలు, కార్లు, ఇతర వాహనాలపై రాకపోకలు సాగిస్తుంటారు. చెట్టు పడే సమయంలో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. రోడ్డు పక్కన చెట్టుకు ఎదురుగా పార్కింగ్ చేసిన కారు స్వల్పంగా దెబ్బతింది.

దుగ్గిరాల-ఈమని రోడ్డుకు శంకుస్థాపన

దుగ్గిరాల: దుగ్గిరాల ఈమని రోడ్డు శంకుస్థాపనను దుగ్గిరాలలో ఆదివారం చేశారు. 4 కిలోమీటర్ల రోడ్డుకి రూ.2.84 కోట్లు అవుతుందని ఎంపీపీ షేక్.జబీన్ తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కె.అనిత, వె.కృష్ణప్రసాద్, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.